క్లుప్తంగా

ఎన్నికల ఫిర్యాదు స్వీకరణ కేంద్రం ఏర్పాటు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ఖరారైన నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కామెండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నట్లు సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. తమ కార్యాలయంలో 94402 95493 నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఎన్నికల షెడ్యూలు అనుసరించి ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనారోగ్య బాధితులకు మానవత ఆర్థిక సాయం



ఆవపాడులో అనారోగ్యబాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: ఆవపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి ఆదివారం మానవత సంస్థ ఆర్థికసాయం అందజేసింది. గ్రామానికి చెందిన కోడే సత్యనారాయణ, ఈర్లపాటి వెంకట్రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. వారిద్దరికి మండల మానవత సంస్థ రూ.4వేలు చొప్పున మొత్తం రూ.8వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఈకార్యక్రమంలో మండలమానవత అధ్యక్షులు ఐడీవీ అప్పారావు,చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు,జిల్లా ట్రెజరర్ గుళ్లపూడివెంకటరత్నం, అచ్యుతమధుసూదనరావు, మద్దూరి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజలు

నిడదవోలు: పట్టణంలోని రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి 634వ లక్షపత్రి, లక్ష కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో నామా సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చోడేశ్వరస్వామికి విశేష పూజలు



కొవ్వూరులో ఉమా చోడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలోని పాతూరు ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని విశేష అలంకరణ చేశారు. చిరవూరి సుబ్రహ్మణ్యం, రమా సత్య శైలజ దంపతులు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ సాయి ప్రసాద్, కొతవరపు భాను ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఏపీ రైతు విభాగం కార్యదర్శి శైలేంద్రరావు



శైలేంద్రరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ఏపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చాగల్లు మండలానికి చెందిన గుమ్మడి శైలంద్రరావుని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అభినందించారు. ఆయనకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, కవల నాగేశ్వరరావు, పిట్టా శ్రీనివాస్, బొందల లక్ష్మణరావు, చొప్పా అప్పల నాయుడు, దేవగుప్తాపు చాందిని, బోడసింగి తులసీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఈడ్పాగంటి శ్రీనివాసరావును ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. తెల్లవారు జామున ఐదు గంటలకు బుద్ధుడు బొమ్మ జంక్షన్ వద్ద ఎనిమిది బీర్ బాటిళ్లతో నిందుతుడ్ని పట్టుకున్నామని తెలిపారు. నిందితుడు పట్టణంలో రాజరాజేశ్వరీనగర్‌కి చెందిన వాడన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్ల పూర్తి

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖాధికారులు
- నియోజకవర్గంలో 19 పరీక్షా కేంద్రాలు, 4,017 మంది హాజరు



నిడదవోలు మున్సిపల్ హైస్కూల్‌లో పది పరీక్షల ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న డిపార్టమెంటల్ అధికారి నాగేశ్వరరావు

నిడదవోలు: విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే పది పరీక్షలు మరి కొద్ది గంటల్లో ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి 30వ తేదీ వరకూ జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులను లోపలికి ఒక గంట ముందు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9.30 గంటల తరువాత లోపలికి అనుమతించరు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు యూనిఫారమ్ దుస్తులు ధరించకుండా సివిల్ దుస్తులనే పరీక్షా కేంద్రాలకు వెళ్లాలి. ఒకవేళ హాల్ టికెట్ లేని పక్షంలో నెట్ సెంటర్లలో డౌన్‌లోడ్ చేసుకుని తీసుకురావచ్చు. పరీక్ష కేంద్రాలకు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు. పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థుల సిద్ధం

విద్యార్థులు చక్కటి ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమయ్యారు. విద్యార్థుల ఉన్నత విద్యనభ్యసించి వారి చక్కటి భవిష్యత్‌కు పదోతరగతి ఉత్తీర్ణత ఎంతో కీలకం. పదో తరగతి పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఉన్నత విద్య ప్రవేశానికి ఎంతో దోహద పడుతుంది. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి ఆయా పాఠశాలల యాజమాన్యం విద్యార్థులను ప్రణాళిక ప్రకారం చదివించారు. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, మండలంలో 9 పరీక్షా కేంద్రాలకు గాను 1814 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉండ్రాజవరం మండలంలో 5 పరీక్షా కేంద్రాలలో 1130 మంది, పెరవలి మండలంలో 5 పరిక్షా కేంద్రాల్లో 1073 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నిడదవోలు పట్టణంలో రవీంద్ర భారతి ప్రైవేట్ పాఠశాలలో 217 మంది విద్యార్థులు, మునిసిపల్ హైస్కూల్-3లో 200 మంది, సెయింట్‌ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 220 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 261 మంది, నారాయణ స్కూల్‌లో 220 మంది, మండలంలో సమిశ్రగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 97 మంది, తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్‌లో 205 మంది, పురుషోత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 212 మంది, కోరుమామిడి జెడ్పీ హైస్కూల్‌లో 182 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఉండ్రాజవరం మండలంలో...

ఉండ్రాజవరం : మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పదీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి 1, 2 సీహెచ్ సేక్సేనా రాజు, డి.శారదజోత్స్న ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 8 ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, బాలురు, బాలికలు కలిపి మొత్తం 1102 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మండలంలో మొత్తం 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల-ఏ సెంటర్‌లో 220 మంది, ఉండ్రాజవరం-బీ సెంటర్‌లో 182 మంది, వేలివెన్ను ఉన్నత పాఠశాలలో 240 మంది, వేలివెన్ను అన్నపూర్ణలో 220 మంది, వేలివెన్ను శశిలో 240 మంది ఈ పరీక్షలకు హాజరగుతారన్నారు. పరీక్షలు కారణంగ అప్రతి సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. విద్యార్థులందరూ సరైన సమయానికి పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని, గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన కోరారు.

చాగల్లు మండలంలో...

చాగల్లు: మండలంలో పదో తరగతి విద్యార్థులు 613 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందులో బాలురు 304 మంది, బాలికలు 309 మంది పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో వి.ఖాదర్‌బాబు తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 506 మంది, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 107 మంది ఉన్నారు.

రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు

పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు



దేవరపల్లిలో ఫ్లెక్సీలను తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలిస్తున్న సిబ్బంది

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అధికారులు ఎన్నికల విధులను చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం గ్రామాల్లోని రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు పంచాయతీ సిబ్బంది ముసుగులు వేశారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడలి ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలించి పంచాయతీ కార్యాలయాలకు తరలించారు. దేవరపల్లి మండలంలోని అన్ని గ్రామలల్లో ఆగమేఘాలపై పంచాయతీ అధికారులు ఎన్నికల నియమావళిని అమలు చేశారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

నల్లజర్ల: ఈనెల18వ తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట బడులు జరుగుతాయని ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న వారందరికీ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట తరగతులు జరుగుతాయన్నారు.

20 నుంచి మదనగోపాల స్వామి కల్యాణ మహోత్సవం



ఆలయం వద్ద ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి 22 తేదీ వరకూ నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆదివారం మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త సింహాద్రి జనార్ధనరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న రుక్మిణి సత్యభామ సహిత మదన గోపాల స్వామి కల్యాణోత్సవం, 21న రథోత్సవం, 22న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. గ్రామస్తులందరిని సహకారంతో కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో నక్కా చిట్టిబాబు, బొర్రా శ్రీరామచంద్ర మూర్తి, అప్పన రాజా, కుసు ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు



మేరీమాతను దర్శించుకున్న ముత్యాల పోసికుమార్, పార్టీ నాయకులు

దేవరపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం నుంచి దేవరపల్లి మండలం గౌరీపటట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రానికి ర్యాలీగా వచ్చారు. జగనన్న వన్స్‌మోర్ అనే నినాదంతో ముత్యాల పోసికుమార్ మేరీమాత అలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టారు. రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అఖండ మెజార్టీతో విజయం సాధించాలని మేరీ మాత ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ మాట్లాడుతూ 2024లో జనన్న మరలా ముఖ్యమంత్రి అవుతారని, దీనికి ప్రతి దివ్యాంగుడు కృషి చేయాలని ఆయన కోరారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్లమెంట్ అభ్యర్థి విజయం సాధించాలని మేరీమాతను ప్రార్ధించి పూజలు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం అధ్యక్షులు ఎస్.విజయదుర్గారెడ్డి, కేవీఆర్ సాగర్, రజనికుమార్, పుష్కర్ సత్యనారాయణ, దివ్యాంగులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుండా చెట్ల నరికివేత



గుడ్డిగూడెంలో విద్యుత్‌లైన్ల పేరుతో నరికిన తాడి చెట్లు

గోపాలపురం: కాలువలో భూములు కోల్పోయి వాటిలో ఉన్న చెట్లకు నష్టపరిహారం చెల్లించకుండా పొలంలో ఉన్న తాడిచెట్లు నరికివేశారంటూ ఓ రైతు వాపోయాడు. ఆయన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు సాగిరాజు అభిమన్యురాజు సుమారు 20 ఎకరాల భూమిని తాడిపూడి, చింతలపూడి కాలువ తవ్వకాలకు ఇచ్చారు.అందులో ఉన్న తాడిచెట్లు, ఇతర వేపచెట్లకు ప్రభుత్వం నష్టపరిహారం ఇంకా చెల్లించలేదు. అయితే రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు తమ విద్యుత్ లైన్లకు అడ్డొస్తున్నాయని సాకుతో అవసరం లేనిపోయినా సుమారు 70 తాడిచెట్లు నరికివేసినట్లు రైతు అభిమన్యురాజు వాపోయారు. వాటిని నరికివేయడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాన్ని కోల్పోయానని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గుడ్డిగూడెం లైన్‌మెన్, భీమోలు లైన్‌మెన్ల కలసి నానా దుర్భాషలు ఆడినట్లు రైతు తెలిపారు. అవసరం లేకుండా నరికిన తాడిచెట్లు ముక్కలు చేసి వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏడీఈ కె.రవిశంకర్‌ను వివరణ కోరగా రైతుతో గొడవ పడిన విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి రైతుకు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

కాపుల సమావేశాన్ని విజయవంతం చేయాలి



కాపు నాయకులను కలిసి మాట్లాడుతున్న నియోజకవర్గ కాపు నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీలోని కాపు నాయకులంతా ఏక తాటి పైకి వచ్చి పార్టీ విజయానికి కృషి చేయడంతో పాటు భవిష్యత్ కార్యచరణపై దృష్టి సారిస్తున్నట్టు మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు(అబ్బులు) తెలిపారు. తాళ్లపూడి మండలంలోని కాపు నాయకులను ఆదివారం బండి అబ్బులు, మైపాల రాంబాబు, తోట రామకృష్ణ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా బండి అబ్బులు మాట్లాడుతూ 18వ తేదీన కొవ్వూరులోని మైపాల రాంబుబు ఫైబర్ నెట్ ఆఫీస్ వద్ద నియోజకవర్గ స్థాయి కాపు నాయకుల సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశానికి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావును కూడా ఆహ్వానించారన్నారు. నియోజక వర్గంలోని కాపు నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. కాపు జేఏసీ నాయకులు తోట రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని బలపరిచేలా కాపు అందరు కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. కాపులకు సముచిత గుర్తింపు వచ్చేలా, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు మైపాల రాంబాబు, వల్లభశెట్టి శ్రీనివాస్, నామా ప్రకాశం, కొమ్మిరెడ్డి పరశురామారావు, గనిశెట్టి బంగారురాజు, వనిమిరెడ్డి శ్రీనివాస్, సిద్ధంశెట్టి కృష్ణ, బండ్రెడ్డి సత్యనారాయణ తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలందరికీ మేలు



పట్టణంలో అచ్చాయమ్మ కాలనీలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కొవ్వూరులో ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ గెలిపించుకుంటేనే ప్రతి పేదవాడికి మేలు చేకూరుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో 21వ వార్డు అచ్చాయమ్మ కాలనీలో వెంకట్రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన 59 నెలలలో సంక్షేమ పథకాల చేకూర్చిన లబ్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. అచ్చాయమ్మ కాలనీలో గతంలో నుంచి నివాసం ఉంటున్న కొందరు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులైన వారందరికీ పట్టాలిప్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సువర్ణపాలనకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు.

స్థానిక వార్డు కౌన్సిలర్ దేవగుప్తాపు చాందిని, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, కంఠమణి రమేష్, బత్తి నాగరాజు, పరిమి సోమరాజు, మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, పిక్కి శ్రీనివాస్, గుర్రే శరత్, చొప్పా అప్పలనాయుడు, పలపాల సూర్యచంద్రం, అంకోలు వెంకట లీల్లి పద్మలీల, పత్తివాడ నాగమణి, బోడసింగి తులసీ, పతివాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మాణిక్యాలరావు, వెంకటేశ్వరరావు

నిడదవోలు: సమాజంలో నిరాదరణకు గురవుతున్న అభాగ్యులను ఆదరించాలని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మాణిక్యాలరావు అన్నారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో నిడదవోలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న చిరువ్యాపారులు జి.వెంకయమ్మ, ఎస్‌కే నూరా, ఎస్‌కే మస్తానాలకు రంగా సుబ్బారావు, సత్యవతిల జ్ఞాపకార్థం వారి కుమారుడు పీఎంజేఎఫ్ లయన్ రంగా వెంకటేశ్వరరావు రూ.20 వేల ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పీఎంజేఎఫ్ కొత్తపల్లి రవికుమార్, క్లబ్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్వీ సత్యనారాయణ జీఎస్ఆర్‌కే ప్రసాద్, గారపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాటిస్తే తప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ

నిడదవోలు రూరల్: ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి మాట మీద నిలిచే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కోరుమామిడి గ్రామం నుంచి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, తిమ్మరాజుపాలెం, నిడదవోలు పట్టణంలోని గణపతిసెంటర్, సంత మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, గణపతిసెంటర్, గణేష్ చౌక్ మీదుగా సమిశ్రగూడెం, డి.ముప్పవరం, పందలపర్రు, పురుషోత్తపల్లి, గోపవరం, విజ్జేశ్వరం వరకు మోటర్‌సైకిళ్ల ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో 1450 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.670 కోట్లతో అభివృద్ధి చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మళ్లీ ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. బైక్ ర్యాలీలో యువకులంతా ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల రామారావు, గజ్జరపు శ్రీరమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,39,573 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ అన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

ధవళేశ్వరం: డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన నేమాని మెహర్ స్మరణ్ సేవలు అభినందనీయమని పద్మశాలి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం వీరవెంకటసత్యనారాయణ(బాబ్జీ) పేర్కొన్నారు. క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ నుంచి డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బాబ్జీ పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. రాజమహేంద్రవరం పద్మశాలి అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

శ్రీరాముని స్మారక వెండి నాణెం కొనుగోలు

సీటీఆర్‌ఐ: రామ జన్మభూమి మందిర నిర్మాణ సందర్భంగా, కోల్‌కతాలోని భారత ప్రభుత్వ మింట్ 50 గ్రాముల స్మారక వెండి నాణేన్ని ముద్రించింది. దీని విలువ 5,300 రూపాయలు. నాణేనికి ఒకవైపు రాముని ప్రతిమ, రెండో వైపు అయోధ్య రామ మందిరం ముద్రించారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారిగా ఈ స్మారక వెండి నాణాన్ని వరదా హారిక అందుకున్నారు. స్మారక వెండి నాణెం జిల్లాలో తొలిసారిగా తాను అందుకోవడం ఆనందంగా ఉందని తన సంతోషాన్ని వెల్లబుచ్చారు.



శ్రీరాముని స్మారక వెండి నాణెం కొనుగోలు చేసిన హారిక

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రకాశం నగర్: తొమ్మిదవ మున్సిపాల్ కాలనీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం స్థానిక మున్సిపల్ కాలనీ క్రీడా మైదానంలో ముగిశాయి. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ 42వ వార్డు ఇన్‌చార్జి నామాని వాసు, కార్యదర్శి వజ్రనాథ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీకే మాట్లాడుతూ క్రికెట్ క్రీడను ప్రతి ఒక్కరూ ఎంచుకొని ఆడడం ద్వారా శరీరానికి వ్యాయామం, మనసుకు ఉల్లాసం, ఆహ్లాదం కలుగుతాయన్నారు.

ఈ టోర్నమెంట్లో మొత్తం పది టీములు పాల్గొనగా, డేని కింగ్స్, రాజా వారియర్స్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో డేని కింగ్స్ విజేతగా నిలిచింది. టీం సభ్యులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా రఫీ, ఉమా, కోట వ్యవహరించారు.